క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



పూజలందుకుంటున్న శ్రీ దత్తాత్రేయస్వామి

కడప కల్చరల్ : శ్రీ దత్తాత్రేయస్వామి జయంతిని శనివారం కడప నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రామకృష్ణనగర్‌లోని శ్రీ సాయి శనీశ్వర ఆలయంలో ఉదయం స్వామికి కాగడ హారతి, అభిషేకం, శ్రీ అనఘాష్టమి వ్రతం, శనీశ్వర స్వామికి తైలాభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ, సాయి శర్మ, స్వామి సేవకులు చంద్రశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మహిళ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళుతున్న సంస్థ సభ్యులు

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఓ అనాథ మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో చిన్నచౌక్ ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి వినతి మేరకు మేముసైతం సేవాసంస్థ సభ్యులు ముందుకు వచ్చి మహిళను తమ ఆత్మబంధువుగా భావించి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ అయ్యవారయ్యతోపాటు రామలోకం, షామియానా సురేష్. రామరాజు, గురవయ్య, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని ఫాతిమా మెడికల్ కళాశాల సెక్రటరీ జవాద్, ఈడీ సల్మాన్ ఆధ్వర్యంలో శనివారం చెన్నూరు మండలం రామనపల్లె మండల పరిషత్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో ఫిమ్స్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రధాన మంత్రి శ్రీ కేంద్రీయ విద్యాలయంలో శనివారం కేవీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ మునేష్‌మీనా, ముఖ్య అతిథి ఓబుల్ రెడ్డిలు కేంద్రీయ విద్యాలయ సంస్థాన్ చరిత్రపై ప్రసంగించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమాన్ని తిలకించారు.

హెచ్‌ఎంలకు కొనసాగుతున్న శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

కడప అర్బన్ : నాయకత్వంలో మాస్టార్లుగా.. సామర్థ్యాలకు సానబెడుతున్నామని జిల్లా విద్యాశాఖాధికారి యు.మీనాక్షి అన్నారు. హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ శిక్షణ–2 పేరుతో ఈనెల 9 నుంచి గీతమ్స్ కాలేజీలో శిక్షణ ప్రారంభించారు. ఈ శిక్షణా షెడ్యూల్ కోర్సును ఏపీస్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఏపీ సీమాట్) సంస్థ రూపొందించింది. వైఎస్ఆర్ జిల్లాకు చెందిన 562 మంది హెచ్‌ఎంలకు రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కోర్సు డైరెక్టర్, కడప జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హైస్కూల్, యూపీ, ఎల్ఎస్ఎల్, మోడల్, కేజీబీవీ, మున్సిపల్ స్కూల్స్, సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లోని 562 మంది స్కూల్ హెడ్ మాస్టర్స్‌లకు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, విజయరెడ్డి, దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, మాస్టర్ ఫెసిలిటేటర్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జమియత్ ఉలేమాల సభకు భారీ ఏర్పాట్లు





కడప నగరం ఆజాద్‌నగర్ వద్ద గల జయరాజ్ గార్డెన్స్ ఆవరణలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటలకు జమియత్ ఉలేమా యే హింద్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు హమీద్ హుసేన్ తెలిపారు. ఈ సభలో సంస్థ జాతీయ అధ్యక్షులు హజరత్ మౌలానా సయ్యద్ అర్షద్ మదని సాహెబ్ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. జాతీయ ఐక్యత, దేశ ప్రజల సమానత్వం తదితర అంశాలపై ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభ కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. - కడప కల్చరల్/చింతకొమ్మదిన్నె

16న విద్యుత్ బిల్లుల దహనం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఈ నెల 16న సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేయనున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకంపై మోపుతున్న అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజానీకంపై మోపబోమని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ భారం వేయటం సమంజసం కాదన్నారు. ఈ భారాన్ని రద్దు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదని ఆయన వివరించారు.

అహం, స్వార్థం వీడినపుడే శాంతి



జ్యోతి వెలిగిస్తున్న బ్రహ్మకుమారీలు, సంస్థ ప్రతినిధులు



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : మానవుడు తనలోని అహం, స్వార్థాన్ని వీడినపుడే మనశ్శాంతి లభిస్తుందని బ్రహ్మకుమారి అంజలిదీది అన్నారు. స్థానిక ఓం శాంతినగర్‌లోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కడప శాఖలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం సంస్థలో ఏటా లాగానే ఈ ఏడాది కూడా మానసిక దృఢత్వం, శాంతి సాధన, దుర్వసనాల నుంచి దూరం కావడం, ఆవేశాన్ని దూరం చేసుకోవడం తదితర అంశాలపై సాధకులకు వారం రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మూడు రోజులుగా ఈ శిక్షణ కొనసాగుతోందన్నారు. మనిషి ఆకర్షణల నుంచి మనసు మరల్చి ధ్యానం ద్వారా ఒత్తిళ్ల నుంచి బయటపడవచ్చని, ఇందుకు మానసిక దృఢత్వం సాధించాలన్నారు. ప్రస్తుత ఆహార వ్యవహారాలు కూడా మనిషిలో క్షణికావేశాలను రెచ్చగొడుతున్నాయని, అందుకే సమాజంలో దూరాగతాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి వారి నుంచి చెడును దూరం చేసి మానసికంగా వారి బలం పెంచేందుకు ఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సనాతన ధర్మం విశ్వమంతటా పెరగాల్సి ఉందని, మన దేశం బ్రహ్మజ్ఞానం ద్వారా సాధించిన శాంతిని అందరూ సాధన చేయాలని తెలిపారు. బీకే అచ్యుత్‌భాయి మాట్లాడుతూ బ్రహ్మకుమారి సంస్థ 140 దేశాలలో శాంతి సాధన కోసం తనవంతుగా ఎనలేని కృషి చేస్తోందన్నారు. బ్రహ్మకుమారీ కడప శాఖ ప్రతినిధి గీతాబెహన్ మాట్లాడుతూ ఏటా నిర్వహిస్తున్న సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఆత్మ, పరమాత్మల కలయికే యోగమని, తమ సంస్థలో రాజయోగం నేర్పుతామని, దాంతో భక్తిమార్గంలో పయనించవచ్చన్నారు. మనోబలం ఉన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్రీస్తు జననం.. మానవాళికి పర్వదినం



గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభువైన ఏసుక్రీస్తు జననం సకల మానవాళికి పర్వదినమని గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఎంఎన్ మణి తెలిపారు. శనివారం నగరంలోని చంద్రమౌళి నగర్‌లో ఉన్న రక్షణ మినిస్ట్రీస్ మందిరంలో గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ సేవకురాళ్ల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రక్షణ మినిస్ట్రీస్ ద్వారా వారు చేస్తున్న దేవుని సేవ, సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సర వేడుకలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కొత్త సంవత్సరంలో దేవున్ని మరింత స్తుతించి ఘనపరచాలని, సువార్తను అందరికీ ప్రకటించాలని పిలుపునిచ్చారు. దైవ సేవకురాళ్లు లలితమ్మ, మోపూరి వనజ, కవిత, సలోమి మాట్లాడుతూ గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసిన చైర్మన్ డాక్టర్ ఎంఎన్ మణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మారుమనస్సు పొంది ఏసుక్రీస్తును నిజ రక్షకునిగా అంగీకరించేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టరమ్మలు సిస్టర్లు సంధ్య, హెప్సిబా, బండి మార్థమ్మ, విజయ, రాజేశ్వరి, సుజాత, శాంతకుమారి ఎస్తేర్‌లు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని వ్రతం

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 7.30 నుంచి శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. మార్గశిర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు సంప్రదాయ వస్త్రాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ధనుర్మాస ఉత్సవాలు సోమవారం నుంచి నెల రోజులపాటు నిర్వహించనున్నామని అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి భక్తులతో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, తిరుప్పావై పారాయణం నిర్వహిస్తామన్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి, అమ్మవార్ల దర్శనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ సుదర్శన హోమాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. జనవరి 11న కూడారైవెళ్లి విశేష ఆరాధన, ఉదయం 5కు గోదావరి నగరోత్సవం, జనవరి 13న ఉదయం 7.30కి పుష్యశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక శ్రీ సత్యనారాయణవ్రతం నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీ గోదాదేవి కల్యాణం, జనవరి 15న సాయంత్రం 4కు పారువేట ఉత్సవం ఉంటాయని ఆయన వివరించారు.

నేడు పుష్పగిరికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పుష్పగిరి చెన్నకేశవస్వామి భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ మీదుగా పుష్పగిరి చెన్నకేశవ స్వామి ఆలయానికి బస్సు బయలుదేరుతుందన్నారు. ఇదిలా ఉండగా శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సట్టి భారవి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం అల్పాహారం, మంచినీరు అందుబాటులో ఉంచుతున్నామని, భక్తులు వాటర్ బాటిల్, రెండు జతల సాక్సులను వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

నేడు గుంటూరులో మాలల మహాగర్జన



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు నేతలు

కడప కార్పొరేషన్ : అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం జరిగే మాలల మహాగర్జన భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షులు చెవుల తిరుపాల్, ఏపీ అధికార భాషా సంఘం మాజీ సభ్యులు తవ్వా వెంకటయ్య తెలిపారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని ప్రతి మాల కుటుంబం నుంచి తమ వంతు బాధ్యతగా కనీసం ఒక్కరైనా హాజరు కావాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ చెల్లదని 30 ఏళ్లుగా మాలలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ వంతు సంఘీభావం తెలిపేందుకు అందరూ కలిసిరావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సలహాదారు ఐత్తా బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బరపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి మెల్ల రాజశేఖర్, జిల్లా మీడియా ప్రతినిధి శీలం ఆనంద్, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు బిర్రు విక్రమ్ కుమార్, మైదుకూరు నియోజకవర్గం అధ్యక్షులు ఎద్దుల వసంత్ కుమార్, ఎర్రగుంట్ల మండలం ట్రెజరర్ మెల్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలైనా హామీలు అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తామని, మధ్యంతర భృతి, పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామని, డీఏలను సకాలంలో ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. 2023 జూలై నుంచే ఉద్యోగులకు పీఆర్సీ అమలులోకి రావాల్సి వుండగా ఏడాదిన్నర పూర్తయినా కార్యరూపం దాల్చలేదన్నారు. పీఆర్సీ కమిషన్ రాజీనామా చేసి నాలుగు నెలలైనా మళ్లీ నియమించలేదని పేర్కొన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి కార్యాచరణను ప్రారంభించేలా చూడాలన్నారు. పీఆర్సీ అమలు ఆలస్యమవుతోందని, కావున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. రెండు విడతల డీఏలను ప్రకటించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను పెన్షనర్లకు సీపీఎస్ ఉద్యోగులకు నగదు రూపంలో చెల్లించాలన్నారు. పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలను పదవి విరమణ చెందిన వారికి ఫైనల్ పేమెంట్లను వెంటనే చెల్లించాలన్నారు. రెండేళ్లుగా సరెండర్ లీవు బకాయిలను చెల్లించాల్సి వుందన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఖాదర్ బాషా, శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి జిల్లా కార్యర్శులు రమేష్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, వి.వి రమణారెడ్డి, సీకే శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్‌లు కృష్ణారెడ్డి, రామ్మోహన్, ఆదిశేషారెడ్డి, అన్వర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ ప్రతినిధులపై దాడి హేయం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లా వేముల మండల కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై రాళ్లతో దాడి చేయడం హేయమని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎస్ఎండీ షఫీ, కె.బాబు, అజ్మతుల్లాఖాన్, ఆ పార్టీ నాయకులు దాసరి శివప్రసాద్, అక్బర్ అన్నారు. శనివారం ఎంపీ అవినాష్‌రెడ్డి కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. కవరేజీలో ఉన్న రిపోర్టర్‌లపై దాడి చేయడం, కెమెరా, లైవ్ కిట్లు ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. పగులగొట్టిన కెమెరాలను వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకనే ఇలాంటి దాడులు చేస్తున్నారని మండిపడ్డారు.

19న మెడికల్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విజయవాడలో ఈ నెల 19న ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ 6వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి డిమాండ్ చేశారు.

నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో శనివారం మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ విభాగాల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల్లో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

న్యాయవాదుల దీక్షలు కొనసాగింపు



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న న్యాయవాదులు

కడప అర్బన్ : కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఓ నంబర్ 145కు వ్యతిరేకంగా కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. కడప నుంచి తిరుపతికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును బదిలీ చేయడంపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఆర్థికంగా బలహీన వర్గాలకు న్యాయసేవలు అందుబాటులో లేకుండా పోతాయని, అనేక మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్ప నాయుడు ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలలో భాగంగా శనివారం రిలే నిరాహార దీక్షలలో న్యాయవాదులు రాజగోపాల్‌రెడ్డి, సాంబయ్య, గంగిరెడ్డి, సుబ్బరామయ్య, అక్బర్, అయ్యవారప్ప, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కాకి.. కహాని





కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు పెద్దలు.. అంటే ఎవరి పిల్లలు వారికి ఇష్టం అని అర్థం. కాకులు ఆహారాన్ని పిల్లలకు ఎంతో ఇష్టంతో తినిపిస్తుంటాయి. ఈ దృశ్యాలు పాలకొండల వద్ద నగర వనంలో సాక్షి తన కెమెరాలో బంధించింది. - సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప

ఆలయ నిర్మాణంలో జాప్యం ఉండదు

జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయస్వామి నూతన ఆలయ భవన నిర్మాణాలలో జాప్యం ఉండబోదని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ జి.మల్లికార్జునప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో వెలువడిన ‘మృత్యుంజయా...ఇదేం జాప్యం స్వామి’ అనే వార్తపై ఆయన స్పందించారు. దేవదాయశాఖ కమిషనర్ 2022వ సంవత్సరంలో సీజీఎఫ్ నిధుల నుంచి రూ.38.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. తర్వాత కర్నూలు మల్టీజోన్–2 కార్యనిర్వాహక ఇంజినీరు టెక్నికల్ పర్మిషన్ మంజూరు చేశారన్నారు. సంయుక్త కమిషనర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పీసీఎస్ఆర్ కోసం రూ.31,75,148కు లోయస్ట్ టెండరు అప్రూవల్ చేశారన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి 2023 ఆగస్టు 5న ఆ టెండరు మేరకు వారితో అగ్రిమెంట్ వర్క్ ఆర్డర్ జారీ చేశారన్నారు. కాంట్రాక్టర్ ఇప్పటికే ఉన్న ఆలయ పునాదులపై కొత్తగా ఆలయ నిర్మాణ పనులు చేసేందుకు కమిషనర్ సీజీఎఫ్ నిధుల నుంచి రూ. 38.50 లక్షలు మంజూరు చేశారని, కాంట్రాక్టర్ ఆ మేరకే పనులు చేశారన్నారు. 2024 అక్టోబరు 24న కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి ఆలయానికి విచ్చేశారని, జరుగుతున్న పనులను పరిశీలించి ఆలయ పునఃనిర్మాణానికి తనవంతుగా రూ.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దేవదాయశాఖ కడప సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారితో చర్చించి ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మించేందుకు దాదాపు రూ.4 కోట్లతో పునః ప్రతిపాదనలు చేయాలని సూచించారన్నారు. ఈ కారణంగా నూతన ప్రతిపాదనల మేరకే ఆలయ పునఃనిర్మాణం జరుగుతుందని తెలిపారు.